"అయ్యో - అయ్యో" అంటూ తన నుదుటిని చేత్తో కొట్టుకుంటూ తలుపు తెరుచుకుని బయటకు పరుగెత్తింది.

"మురళిగారూ! దయచేసి ఇక్కడనుంచి వెళ్లిపోండి! ప్లీజ్ -" అంది బాధతో విలవిల లాడుతూ.

"అయితే మరి నా ప్రేమ వప్పుకున్నట్లేనా?"

"అయ్యో! ఎలా చెప్పేదండీ మీకు! నేను పవిత్ర భారతదేశంలో పుట్టిన స్త్రీనండీ! ఒకసారి ఆమె మెడలో ఎవరయినా తాళి కడితే ఆవు మెడలో పలుపు కట్టినట్లేనండీ! ఆ వ్యక్తి చనిపోయినా, హిమాలయాలకు వెళ్లిపోయినా ఆమె మనసు మారదండీ! పరాయి మొగాడిని కన్నెత్తి కూడా చూడదు..."

"నేనిప్పుడు పరాయి మగాడినేగా - ఇక్కడికెందుకొచ్చారు మరి?"

"అయ్యో! ఇది ప్రేమ కాదండీ! జాలి! పవిత్ర భారతదేశంలో స్త్రీకి పరాయి మగాడి మీద జాలి కలగడంలో తప్పులేదని మన శాస్త్రాలు ఘోషిస్తున్నాయండీ!"

"నాక్కావలసింది కూడా అదే రాధా! ప్రేమకు మొదటి మెట్టే జాలి! అంటే ఇవాళ జాలీ రేపు ప్రేమ! వస్తానండీ! థాంక్యూ" అనేసి పరుగెత్తాడు మురళి.

రాధ నిర్ఘాంతపోయి చూస్తూ నిలబడిపోయింది.

రాధ తన ఫ్రెండ్స్‌తో బ్లూమూన్ హోటలు కొచ్చింది. ఆమె స్నేహితురాలు రంజిత బర్త్‌డే పార్టీ జరుగబోతోందక్కడ. అయితే తనను మురళి వెంటాడుతున్నాడన్న విషయం రాధకు తెలీదు.

మురళి తన గాంగ్ వాళ్ళందరితో కలిసి మేనేజర్ దగ్గరికెళ్ళాడు.

"ఇవాళ నేను సితార వాయించేందుకు పర్మిషన్ ఇవ్వాలి" అడిగాడతనని!

పెద్ద పెద్ద హోటళ్ళలో ఇలా తినేవాళ్ళు తింటూ వుండగా వాయించే వాళ్ళు ఒక పక్క వాయిస్తూ వుంటారు. ఒకప్పుడు గిటార్ వాయించేవారు, ఇప్పుడు సితారు ఫాషనయింది.

"ఏం బాబూ? మా హోటల్ ఇలా అభివృద్ధి చెందడం మీకిష్టం లేదా?" అడిగాడు మేనేజరు రెండు చేతులూ జోడించి.

"నా ప్రేమ అభివృద్ధి చెందడం మీ కిష్టం లేదా?"

మేనేజర్‌కి అర్థం అయింది "ఐసీ! ఫ్లాష్ బాక్ ఉందన్నమాట".

"చిన్నది! మీ హోటల్‌కేమీ ట్రబులుండదని హామీ ఇస్తున్నాను."

"అయితే ఓకే!"

రాధ అయిస్‌క్రీమ్ తినబోతూండగా మైక్ ముందు ఎనౌన్స్‌మెంట్ వచ్చింది.

"ఇప్పుడు భారతదేశ ప్రఖ్యాత సితారిస్ట్ శ్రీమురళిగారు తమ మ్యూజిక్‌తో మీ హృదయాలను దోచుకుంటారు"

మురళి మైక్ ముందుకొచ్చి ఆమెను చూసి చిరునవ్వు నవ్వాడు.

"డియర్ ఫ్రెండ్స్! నా ప్రియురాలి ప్రేమను పొందడానికి ఇది ఆఖరి రోజు! ఇదే ఆఖరి అవకాశం!! ఈ రోజే నా ప్రేమ మీ అందరి ఎదురుగ్గా పుష్పించాలి. మీ అందరి ఎదురుగ్గా నా ప్రియురాలు తన అంగీకారాన్ని తెలియజేయకపోతే నా జీవితం ఇక్కడే ముగిసిపోతుంది. ఆమె తన ప్రేమను వెల్లడించేవరకూ ఈ సితార్ సంగీతం ఆగదు-"

హోటల్‌లో కూర్చున్నవాళ్ళందరికీ ఆసక్తి కలిగి కరతాళ ధ్వనులు చేశారు. మరుక్షణం మురళి వాద్య సంగీతం ప్రారంభమయింది.

"ఆ అమ్మాయి ఎవరయి ఉంటారు?" ఆశ్చర్యంగా అడిగింది రంజిత.

"ప్రస్తుతం హోటల్లో పక్కన బాయ్ ఫ్రెండ్స్ లేకుండా ఉన్న వాళ్ళం మనం అయిదుగురిమే! కనుక మనలోనే ఎవరో ఒకరై ఉండాలి!" అంది ఉమ.

"నేనైనా బాగుండేది!" అంది బిందు మురళిని ఆశగా చూస్తూ.

రాధకేం మాట్లాడాలో తోచలేదు. వాయిద్యం జోరు పెరిగిపోతోంది.

"ఒకవేళ నువ్వా రాధా?" అనుమానంగా అడిగింది భానుమతి.

"ఆ.....అహ.......కాదు" ఖంగారుగా అంది రాధ.

మురళి మొహంలో బాధ కనబడుతోంది. అతని చేతివేళ్ళు తెగిపోతాయేమో అన్నంత వేగంగా కదులుతున్నాయ్. రాధకు చెమటలు పట్టేస్తున్నాయి.

హఠాత్తుగా ఓ ముసలమ్మ లేచి పూనకం వచ్చిన దాన్లా స్టేజి ఎక్కేసింది. వెనుకే ఆమె భర్త పరుగెత్తాడు.

"నిన్నెలా ప్రేమిస్తాడే నీ మొహం! ఆరుగురు పిల్లలు నీకు-"

"మీకు తెలీదండీ! ఆ కుర్రాణ్ణి చూస్తుంటే నాకే ఓదార్చాలనిపిస్తుంది"

"చాల్చాల్లే ఊరుకో! ఎవరయినా నవ్వుతారు."

"ఎందుకు నవ్వటం? ఆ పిల్ల ఎవత్తో నిజంగా రాక్షసి అయి ఉంటుంది. అది హృదయం కాదు, రాయి."

రాధకు మురళిమీద జాలి, కోపం, చిరాకూ, ప్రేమా అన్నీ కలిసిపోయి ఉక్కిరి బిక్కిరి చేసేస్తున్నాయి. ఇప్పుడేమిటి చేయటం? వెళ్ళి అతనిని నివారించాలా? వప్పుకోవాలా?

మురళి ఆమె ముఖకవళికలు గమనిస్తూనే ఉన్నాడు. ఇంకొంచెం ఇంకొక్క డోస్! అంతే! ఆమె లేచి వచ్చేస్తుంది.

సితార వాయిస్తూనే తన గాంగ్ కూర్చున్న టేబుల్‌కేసి చూశాడు. ఆ అవకాశం కోసమే ఎదురు చూస్తున్న అమితాబ్ టేబుల్ మీదున్న టొమాటో కెచప్ తీసుకుని మురళి దగ్గరికొచ్చి, అతడి చెమట తుడుస్తున్న వాడిలా నటిస్తూ దాన్ని పక్కన పెట్టాడు.

అమితాబ్‌ని అడ్డు పెట్టుకుని, మురళి ఆ టమోటా జ్యూస్‌లో వేళ్ళు పెట్టాడు.

అంతే!

అతని చేతి వేళ్ల నుంచీ రక్తం కారుతున్నట్లు ఒక్కో చుక్కే పైజామా మీదకు జారసాగింది. హాలంత కలవరం బయలుదేరింది.

“అరె బాప్రే రక్తం” అంది రంజిత కళ్ళు మూసుకుంటూ.

“మైగాడ్! హి ఈజ్ క్రేజీ!” అంది భానుమతి “ఈ ముసలమ్మగారన్నట్లు అదెవత్తో నిజంగా రాక్షసే”

రాధ ఇంక సహించలేకపోయింది. పరుగుతో స్టేజీమీదకు వెళ్ళి అతని చేతుల్ని పట్టేసుకుంది.

కంటినిండా కారుతున్న నీటితో “మురళి - ఐ లవ్ యూ.........” అంది.

ముందు నిశ్చేష్టులయిన అందరూ సంతోషంగా తప్పట్లు కొట్టేశారు.

తన చేతులకున్నది టమోటో జ్యూస్ అన్న సంగతి తెలీకుండా వెంటనే జాగ్రత్తలు తీసుకున్నాడు మురళి.

8

అదేరోజు రాత్రి పదింటికి ఒక ఆకారం నెమ్మదిగా ఒక కాంపౌండ్ వాల్ ఎక్కింది. గూర్ఖా ముందువైపు వున్నాడు. మొత్తం పెరడంతా నిశ్శబ్దంగా వుంది. కుడివైపు వున్న వాటర్ పైపు పట్టుకుని పైకెక్కి పడగ్గది దగ్గిరకు చేరుకుని, కిటికీ రెక్కమీద చిన్నగా చప్పుడు చేసింది.

పుస్తకం చదువుకుంటున్న రాధ ఆ చప్పుడుకి తలెత్తి చూసి తన కళ్ళని నమ్మలేనట్టు “.......మురళి” అంది.

“అవును, నేనే రాధా!”

రాధ చప్పున గుమ్మం వైపు చూసింది. ఆమె కళ్ళలో భయం కనిపించింది. పరుగెత్తుకుంటూ వెళ్ళి తలుపు వేసేసి కిటికీ దగ్గిరకి వచ్చింది “మురళి - ఏమిటిది - వెళ్ళిపో ! ప్లీజ్! ఎవరన్నా చూస్తే బావోదు” అని కంగారుగా అంది.

“నేను నిన్ను చూడకుండా ఒక్క క్షణం కూడా ఉండలేకపోతున్నాను రాధా......ఈ రాత్రి నిన్ను ఒక్కసారైనా చూడకపోతే బ్రతకలేననిపించింది”.

“ప్లీజ్! వెళ్ళిపో మురళి - నాన్న చూస్తే చంపేస్తాడు”

“భార్యా భర్తలు కలుసుకోకుండా ఎవడూ ఆపలేడు రాధా! మీ నాన్నని నేనే కలుసుకుని చెబుదామనుకుంటున్నాను.”

రాధ నిర్ఘాంతపోయింది “భార్యాభర్తలా?”

“అవును రాధా! చిన్నప్పుడు నీ మెళ్ళో తాళి కట్టింది నేనే”

రాధకి స్పృహ తప్పుతున్నట్టు అనిపించింది. అతి కష్టం మీద తమాయించుకుంది. అయోమయంగా చూసింది.

“నమ్మకం కుదరటం లేదా రాధా! నేనే......కృష్ణని....ఇద్దరం దండలేసుకుని నాయనమ్మకి నమస్కారం పెట్టాం గుర్తులేదా..”

ఇంకా ఏదో చెప్పబోతున్న అతడిని వారించి -"ఆగు మురళి....అట్నుంచి బాల్కనీలోకి రా!" అంటూ పరుగెత్తుకువెళ్ళి తలుపు తీసి తను కూడా బాల్కనీలోకి వెళ్ళింది.

ఇద్దరూ కలుసుకోగానే కృష్ణ చేతులు సాచాడు.

ఆమె వాటిమధ్య ఒదిగిపోయింది.

"ఈ విషయం........ఈ విషయం నాకు ముందే ఎందుకు చెప్పలేదు?" ఉద్వేగంతో ఆమె రోదిస్తోంది.

"నిన్ను నిన్నుగా గెల్చుకోవాలని.....రాధా - చిన్నప్పుడు తాళి కట్టిన భర్తగా వచ్చి, నిన్ను ప్రేమించమనటం నాకిష్టం లేకపోయింది. అందుకే ఇంత కష్టపడి నీ ప్రేమని పొందగలిగాను. చివర్లో తెలిసింది. చిన్నప్పుడే నేను తాళి కట్టిన రాధవి నువ్వేనని-"

"నేనూ చాలా మధనపడ్డాను మురళి! ఒకసారి వివాహమైనదానిని మళ్ళీ ప్రేమించటం ద్రోహమనీ, అన్యాయమనీ - అందుకే నీ ప్రేమని అంగీకరించటానికి అంత తటపటాయించాను - నన్ను అర్థం చేసుకో -"

"ఏది ఏమైనా భగవంతుడు కరుణామయుడు. మనల్ని చివరికి ఇలా కలిపాడు" ఆమె భుజంమీదనుంచి పక్కకు చూస్తూ అన్నాడు కృష్ణ. క్రింద ఇంకా ఏ అలజడీ వినిపించకపోవడంతో అతడికి తొందరగా వుంది.

"నన్ను - ఇన్ని సంవత్సరాల తరువాత ఎలా గుర్తుపట్టావు మురళి?"

"మీ మామయ్య చెప్పాడు రాధా! నీకు తెలుసుగా బోయస్ హాస్టల్ వార్డెన్ రామలింగం, మీ మామయ్య - నాకు బాబాయి అవుతాడు...... దూరపు వరస......."

"అవును. మనిద్దరం తనకి థాంక్స్ చెప్పుకోవాలి" అంటూ రాధ నవ్వింది. ఆమె టెన్షన్ తగ్గిపోయింది. ప్రపంచాన్ని గెల్చినంత ఆనందంగా వుంది ఇప్పుడు. ప్రేమించినవాడే భర్త కావటం -

అలా ఒకరి కౌగిలిలో ఒకరు ఎంతసేపున్నారో తెలీదు. హఠాత్తుగా లైటు వెలిగింది. మెట్లమీద నరసింహం నిలబడివున్నాడు.

రాధని వదిలిపెట్టి అతడు నరసింహం వైపు ఓ క్షణం చూశాడు. ఆ క్షణంలో ఎన్నో భావాలు.

ఇతడే......ఇతడే...... తన కుటుంబం సర్వనాశనం అవటానికి కారకుడు. తన తల్లి ఇన్నేళ్ళు జైల్లో మగ్గటానికి కారణభూతుడు.

అతడిని చూడగానే కృష్ణ రాధని వదిలి బాల్కనీమీదినుంచి క్రిందికి జారాడు. ఈ హఠాత్ సంఘటనకి రాధ బిత్తరపోయింది.

ఈ లోపులో నరసింహం పైకి వచ్చి "ఎవరదీ" అంటూ బాల్కనీ అంచువరకూ పరుగెత్తాడు. కృష్ణ ప్రహరీ దాటి పారిపోవటం, నరసింహం "పట్టుకోండి - పట్టుకోండి" అని అరవటం ఒకేసారి జరిగాయి.

గూర్ఖా పరుగెత్తుకువచ్చాడు గానీ లాభం లేకపోయింది. అప్పటికే కృష్ణ చీకట్లో కలిసిపోయాడు.

*　　　　　*　　　　　*　　　　　*

"అదీ కంప్లెయింటు. మీరు వెంటనే వాడిని అరెస్ట్ చేయండి" కుర్చీ వెనక్కి వాలి కాగితం అందిస్తూ అన్నాడు నరసింహం. తన ఇంటిలో మురళి అనే కుర్రవాడు అర్థరాత్రి దొంగతనంగా ప్రవేశించి అల్లరి పెట్టాడని కంప్లెయింటు అది.

"వెంటనే మావాళ్ళని పంపిస్తాను" అంటూ ఇనస్పెక్టర్ ఆ కాగితం అందుకుని చదివి, "బోయస్ హాస్టల్ - మురళినా-" అన్నాడు ఆశ్చర్యంగా.

"అవును. ఏం?"

"14వ తేదీ రాత్రి పదిన్నరకి?"

"అవును."

ఇనస్పెక్టర్ తనలో తనే ఏదో గొణుక్కుంటూ ఆ కంప్లెయింటు వైపు చూశాడు. తరువాత బెల్‌కొట్టి జవానుని పిలిచి, హాస్టల్‌కి వెళ్ళి మురళి అనే అబ్బాయిని పిలుచుకు రమ్మన్నాడు.

జవాను వెళ్లిపోగానే "మీకు నిశ్చయంగా తెలుసా? మీ ఇంటికి వచ్చినతని పేరు మురళీకృష్ణ అని?" అని మళ్ళీ ఇంకొకసారి అడిగాడు.

"తెలుసు. మా అమ్మాయి చెప్పింది."

"ఆమెనోసారి పిలిపించండి-"

నరసింహం కోపంగా "అమ్మాయిని పోలీస్‌స్టేషన్‌కా? ఎందుకు?" అని అడిగాడు.

"మీరు చెప్పే మురళి నిన్నరాత్రి తొమ్మిదిన్నరనుంచీ పన్నెండింటి వరకూ ఇక్కడే వున్నాడు కాబట్టి-"

"వ్వాట్?" అని నరసింహం నోరు తెరిచాడు.

ఈలోపులో మురళి వచ్చాడు "ఏం సార్ పిలిచారుట. వాడు దొరికాడా?"

"నీలాగే తిరుగుతున్న వాడి సంగతేనా నువ్వు చెప్పేది. వాడు ఈ సారి నీప్రాణాల మీదకే తెచ్చాడోయ్. ఇదిగో ఈ నర్సింహంగారి కూతురితోనే నీ పేరుమీద రొమాన్సు మొదలుపెట్టాడట"

నరసింహం ఉలిక్కిపడి - కోపంగా "రొమాన్సేమిటి నాన్సెన్స్! వచ్చి మాట్లాడాడంతే" సరిదిద్దాడు.

"ఎవరు రాధతోనా?" అదిరిపడి మురళి అన్నాడు.

"అవును, అందుకే నిన్ను అరెస్టు చేయమంటున్నాడు"

"ఇన్‌స్పెక్టర్‌గారూ! మీరు వెంటనే వాడిని పట్టుకోవాలి. లేకపోతే మరెన్ని ఘోరాలు చేస్తాడో వాడు" మురళి అంటూండగా రామలింగం వచ్చాడు.

"ఎవరో పోలీస్ వచ్చి హాస్టల్‌నుంచి మురళిని పిలిచికెళ్ళాడంటే కంగారుగా వచ్చాను

ఏమిటి సంగతి?" అంటూ నర్శింహాన్ని చూసి "ఏం బావా ఇలా వచ్చావ్?" అని అడిగాడు.

ఇనస్పెక్టర్ జరిగినదంతా చెప్పి "ఆ టైమ్‌లో ఈ అబ్బాయి నా దగ్గరే వున్నాడని బల్లగుద్ది చెప్పగలను" అన్నాడు.

"మొన్న మంగలిషాపులో ఇదే గొడవైంది కదూ!"

"అవును సార్! నా పేరుమీద వాడు అప్పులు కూడా తీసుకున్నాడు. అందుకే పోలీస్ కంప్లెయింట్ ఇవ్వటానికి నేను నిన్నరాత్రి ఇక్కడకు వచ్చాను. అది చూచివాడు అక్కడికి వెళ్ళి నా రాధతో......"

"నీ రాధ ఏమిటోయ్? బొడ్డు కోసి పేరు పెట్టావా?" అరిచాడు నర్శింహం.

"లేదు. కానీ చేతిలోకి చెయ్యి తీసుకుని ప్రామిస్ చేశాను. చిన్నప్పుడే పెళ్ళి చేసుకున్న మేం అదృష్టవశాత్తు తిరిగి కలుసుకున్నాం. ప్రేమించుకున్నాం. ఈసారి నిజం పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాం"

నరసింహం కుర్చీలోంచి చివాలున లేచి "ఇనస్పెక్టర్‌గారూ ఆ తుపాకీ ఇలా ఇవ్వండి. వీడిని షూట్ చేసి పారేస్తాను" అన్నాడు.

"ఇది పోలీస్‌స్టేషన్.......బాటిల్ ఫీల్డ్ కాదు.......మీ మీ గొడవలు బయటకెళ్ళి తీర్చుకోండి-పోతే మీరిచ్చిన కంప్లెయింటు మీద చర్య తొందర్లోనే తీసుకుని, నిన్నరాత్రి మీ ఇంటికొచ్చిన వాడిని తప్పక పట్టుకుతీరతాం. ఆ దొంగా, ఈ మురళి ఒకేలా వుంటారు కాబట్టి, ఈ మురళి ఫోటో పేపర్లో వేసి, ఫలానా రోజు రాధ అనే అమ్మాయితో రాత్రి పదింటికి బాల్కనీ మీద......"

"ఆపండి!" అని అరిచి, ఇన్‌స్పెక్టర్ చేతిలో కాగితం లాక్కున్నాడు నరసింహం "మీరేం చెయ్యనవసరంలేదు. ఇది ప్రైవేటు వ్యవహారం నేను చూసుకోగలను." అంటూ బయటకు నడిచాడు.

వెనుకే రామలింగం బయల్దేరాడు.

"బావా! నువ్వు ఆవేశపడి మొత్తం వ్యవహారాన్నంతా పాడు చేస్తున్నావు. ఈ మురళి ఎవరనుకుంటున్నావు? చిన్నప్పుడు మన రాధ మెడలో దండ వేసినవాడే......"

"అయితే అవ్వొచ్చు గాక. గాలికి తిరిగే దిమ్మరికి నా కూతుర్ని ఇమ్మంటావా?"

"ఇవ్వటం ఏమిటి బావా? పదిహేను సంవత్సరాల క్రితమే ఇచ్చేశావు. ఇప్పుడు కాదంటే ఆ మురళి ఊరుకుంటాడా? అందర్నీ బజారుకి లాగుతాడు. పోనీ నీ కూతురేమైనా తక్కువ తిన్నదా అంటే అదీలేదు. దానిచేత తిరిగి నుదుట బొట్టు పెట్టించటానికి ఎంత కష్టపడ్డామో నువ్వే ఆలోచించు. అటువంటిది అదృష్టవశాత్తు తిరిగి తన మొగుడ్ని కలుసుకుంది. ఇప్పుడు నువ్వు కాదంటే ఏ నుయ్యో, గొయ్యో చూసుకుంటుంది."

నరసింహం ఆలోచనలో పడ్డాడు "అంతేనంటావా?"

"నిశ్చయంగా అంతే!"

"నాకొంచెం ఆలోచించుకోవటానికి టైమివ్వు" అంటూ నరసింహం వెళ్లిపోయాడు.

అతడలా వెళ్ళాడో లేదో వెనుకనుంచి మురళి గాలిలా వచ్చి రామలింగం చేతులు పట్టుకుని ఊపేస్తూ "థాంక్స్ .....థాంక్స్ గురూగారూ! మీ ఋణం ఎలా తీర్చుకోను?" అన్నాడు.

"హాస్టల్‌లో మరి నన్ను అల్లరి పెట్టకుండా-"

ఇంటికి వెళ్ళాడన్న మాటేగానీ నరసింహం దీర్ఘాలోచనలో ఉన్నాడు. ఇన్నేళ్ళ తరువాత, పాతబడి పోయిందనుకున్న సమస్య మళ్ళీ తలెత్తింది.

శారదమ్మ జైలునుంచి ఎటు వెళ్ళిందో తెలీదు. ఆవిడ కొడుకు తన కల్లుడు కాబోతున్నాడు. దీనివల్ల తనకొచ్చే నష్టాలూ - లాభాలూ బేరీజు వేసుకున్నాడు.

దాదాపు పదిహేను సంవత్సరాల క్రితం జరిగిన సంఘటన అతడి మనసులో కదలాడింది.